క్లుప్తంగా

ఐటీఐలో నాల్గో విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

సీతంపేట: ఐటీఐలో మిగులు సీట్లకు నాల్గో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న కౌన్సెలింగ్ సీతంపేట ఐటీఐలో ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధి పనుల వద్ద బోర్డులు



పండ్ల తోటల ట్రెంచింగ్ పనులు పరిశీలిస్తున్న ఏపీఓ

భామిని: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన భూ అభివృద్ధి పనులు, పండ్ల తోటల ట్రెంచీల పనుల వద్ద బోర్డులు పెట్టించాలని ఆ పథకం ఏపీఓ ఇ.తులసీదాస్ మంగళవారం సూచించారు. మండలంలోని చిన్నదిమిలి, కాట్రగడలలో ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్వరలో కేంద్ర పరిశీలన బృందం పర్యటించనుందని, పనుల వద్ద వివరాలతో కూడిన బోర్డులు పెట్టించాలన్నారు. ఎఫ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఎంపీపీ శెట్టి పద్మావతి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బుధవారం నుంచి మూడు రోజుల పాటు అంతర కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఎచ్చర్ల సౌజన్యంతో వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలకు మహిళలు, పురుషులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వాలీబాల్ పురుషుల విభాగంలో 17టీంలు, వాలీబాల్ మహిళల విభాగంలో నాలుగు టీంలు, కబడ్డీ పురుషుల విభాగంలో 11 టీంలు, కబడ్డీ మహిళల విభాగంలో ఆరు టీంలు పాల్గొననున్నట్లు తెలిపారు. వివరాలకు 9550406959 నంబరుకు సంప్రదించాలన్నారు.

విశ్వశాంతి హోమం



హోమ పూజను ప్రారంభిస్తున్న పీఠాధిపతులు, అర్చక బృందం

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీతీరాన వెలసిన వేణుగోపాలస్వామి, లక్ష్మీనృశింహస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వశాంతి శ్రీమద్ భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞాన్ని మంగళవారం నిర్వహించారు. అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

80 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో సత్యసాయి మందిరం వద్ద మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో శ్రీకాకుళం రాగోలు జెమ్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 80 మందికి కంటి పరీక్షలు చేశారు. 25 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు వైద్యాధికారి గీతాప్రియ తెలిపారు. మిగిలిన వారికి అవసరమైన మందులు అందజేశారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు మందులు, కళ్లద్దాలు అందివ్వడం జరుగుతుందని క్యాంప్ కోఆర్డినేటర్ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో జి.శ్రావణ్‌కుమార్, కె.గౌరీనాథ్ పాల్గొన్నారు.

గంజాయి, సారాలపై ఉక్కుపాదం

● ఎస్పీ మాధవరెడ్డి

సాలూరు: గంజాయి, సారాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సాలూరు రూరల్, మక్కువ పోలీస్ స్టేషన్లను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసులపై ఆరాతీశారు. స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని, ప్రజలతో స్నేహపూర్వకం(ఫ్రెండ్లీ పోలీస్)గా నడుచుకోవాలని సూచించారు. అనంతర స్టేషన్ ఆవరణలో సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అంకితా సురానాతో కలిసి మొక్కలు నాటారు.

మొక్కజొన్నను ప్రత్యామ్నాయ పంటగా వేసుకోవాలి



ఘనసరలో మొక్కజొన్న గింజల సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

భామిని: పత్తి వంటి వాణిజ్య పంటలలో వాడుతున్న క్రిమిసంహారకాలు, కృత్రిమ ఎరువులతో భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, పంట మార్పిడిలో ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న సాగుపై దృష్టి సారించాలని ఏఓ కె.సింహాచలం సూచించారు. మండలంలోని ఘనసర, సతివాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.

ఇందులో పాల్గొన్న ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. క్షేత్ర స్థాయిలో మొక్కజొన్న పొత్తులను గింజలు తీస్తున్న యంత్రం పనితీరును చూపించారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీతంపేట: సేంద్రీయ వ్యవసాయం సాగుతో అత్యధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి శ్రీదేవి అన్నారు. మండలంలోని దేవనాపురం, గుమ్మడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వరిలో ఆకుమడత, సుడిదోమ తెగుళ్లను గుర్తించారు. ఏపీ మందులు వాడాలో సూచనలిచ్చారు. సీమాస్త్రం, కషాయాల గూర్చి తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వీరఘట్టం: రానున్న తుఫాన్ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వీరితో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేసారు. ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతీ రోజు తాగునీటి పరీక్షలు చేయాలని, ఫలితాలను పీఆర్ ఒన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష



సూచనలిస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో రమేష్ మంగళవారం సమావేశమై, గృహ నిర్మాణాలపై సమీక్షించారు. లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంజూరైన ప్రతీ ఇల్లు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు.

అనర్హుల పింఛన్లు తొలగించాలి



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న వండువ గ్రామస్తులు

వీరఘట్టం: తమ గ్రామంలో కొంత మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నారని వండువ గ్రామానికి చెందిన పలువురు ఎంపీడీఓ బి.వెంకటరమణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. విచారణ చేసి అనర్హుల పింఛన్లు తొలగించాలని వీరు కోరారు. వెంటనే విచారణ చేపడతామని ఎంపీడీఓ తెలిపారు.

విశ్వబ్రాహ్మణుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు(కమ్మరి, వడ్రంగి, కంచరి, స్వర్ణకారులు, శిల్పికారులు) ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గాయత్రి పంచవృత్తుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ స్వర్ణకారుల కార్పొరేషన్ ప్రకటనను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వబ్రాహ్మణులమంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆలయ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణులు కీలక పాత్ర పోషిస్తారని, ఆలయ కమిటీలో విశ్వబ్రాహ్మణులను సైత సభ్యులుగా చేర్చాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. మండలంలోని మొండెంఖల్లు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అధికారులంతా తమ పరిధిలోని ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంజిత్‌కుమార్, కొండయ్య, వెంపటాపు భారతి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని గెడ్డతిరువాడ గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో ఎస్.రమేష్ మంగళవారం సందర్శించి, అక్కడి రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఎంపీడీవో సంతృప్తి వ్యక్తం చేశారు.

పెద్దింపేటలో దాహం కేకలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బలిజిపేట: మండలంలోని పెద్దింపేట గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. తాగునీటి కోసం గ్రామస్తులు పొలాల్లో ఉన్న బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. పొలంగట్ల మీదుగా తాగునీరు తెచ్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో ఇంకెంత దారుణంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామవీధుల్లో ఖాళీ బిందెలతో మహిళలు మంగళవారం నిరసన తెలిపారు.

అక్షయపాత్రకు అప్పగించొద్దు

పార్వతీపురంటౌన్: గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలో, కళాశాల వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అక్షయ పాత్ర సంస్థ ద్వారా భోజనాలు సరఫరా చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇదే జరిగితే గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం మరింత దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచకుండా, సరిపడా వర్కర్లు లేకుండా, సరైన పర్యవేక్షణ చేయకుండా ఒకటి, రెండు పాఠశాలలో జరిగిన కలుషిత ఆహార ఘటనలు చూపించి పేద గిరిజన విద్యార్థులకు నష్టం చేసే ఆలోచన చేయడం ఏమాత్రం సరైం

అందరి భాగస్వామ్యంతోనే సుందర పార్వతీపురం సాధ్యం



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: అందరి భాగస్వామ్యంతోనే పార్వతీపురం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పట్టణ సుందరీకరణపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడం, చెత్తసేకరణ, పారిశుద్ధ్య నిర్వహణపై చర్చించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. పిల్లల కోసం చిల్డ్రన్‌పార్కులు ఏర్పాటు చేయాలన్నారు. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మన పార్వతీపురం లోగో, సెల్ఫీ పాయింట్లు, డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయాలని, గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా సవర ఆర్ట్స్‌తో కూడిన చిత్రాలను, ప్రజలను చైతన్యపరిచే చిత్రాలను వేయించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత అందంగా తీర్చిదిద్దాలి

జిల్లాలోని 516 అంగన్‌వాడీ కేంద్రాలను మరింత అందంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల లోపల, వెలుపల నిర్దేశించిన రంగులను వేయాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి వెలుపల అందరికీ కనిపించేలా నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రానికి అవసరమైన ఫర్నీచర్‌ను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కేంద్రానికి వచ్చే పిల్లలు చదువుకునేందుకు మంచి వాతావరణం కల్పించాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, డీఈఓ జి.పగడాలమ్మ, జిల్లా అధికారులు, సీడీపీఓలు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలను గౌరవించాలి

సీతానగరం: దేశ ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసు కుటుంబాలను గౌరవించాలని, అమరవీరుల త్యాగాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి ఏఎస్ఐ గంటా శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ సమస్మరణ దినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసుల విధులు, విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, వారి త్యాగాలను విద్యార్థులకు వివరించారు. అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ, వారి కుటుంబాల్లో మనోధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏటా సమస్మరణ దినోత్సవాలను జరుపుకుంటున్నట్లు చెప్పారు. యువత దేశ సేవకు ముందుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌సీలు, పీసీలు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కమ్ముకున్న పొగమంచు



గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీని పొగమంచు కమ్మేసింది. రాత్రి నుంచి ఉదయం 7 గంటల వరకు దట్టంగా పొగమంచు కురవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. పాదచారులు అయితే సెల్‌ఫోన్ లైటు వేసుకుని మరీ నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీతాకాలం ఆరంభం కాకముందే ఇటువంటి వాతావరణం నెలకొనడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. -గుమ్మలక్ష్మీపురం

టీచర్లపై యాప్స్ భారం లేకుండా చూడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న యూటీఎఫ్ సంఘ సభ్యులు

భామిని: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పీఆర్‌సీ కమిటీని పునఃసమీక్షించి ఐఆర్ ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆరిక భాస్కరరావు డిమాండ్ చేశారు. మండలంలోని అత్తికొత్తూరు పాఠశాలలో సంఘం అధ్యక్షుడు ఇ.తిరుపతిరావు ఆధ్వర్యంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్స్ భారం తగ్గించాలన్నారు. జనాభాలో 81 శాతం ఉన్న బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజనులకు ప్రభుత్వ విద్య అందేలా విద్యారంగం పరిరక్షణకు యూటీఎఫ్ నిరంతరం పాటు పడుతుందని సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బి.చిన్నారావు, అధ్యక్షుడిగా ఇ.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా కద్రక ప్రసాద్, కోశాధికారిగా బి.మహేష్‌తో పాటు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సాగునీటి ప్రాజెక్ట్‌లు పూర్తి చేయాలి



పట్టణంలో ర్యాలీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ: కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్ట్‌లను తక్షణం పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు కోరారు. అనకాపల్లిలో జరుగుతున్న ఉత్తరాంధ్రుల ప్రాంతీయ రైతు సదస్సుకు మంగళవారం పాలకొండ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పాలకొండ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి పాలకుల నిర్లక్ష్యం కారణంగా మారిందని ఆరోపించారు. మండలంలోని జంపరకోట, ఒడిశాలోని ఝుంఝావతి, తోటపల్లి కాలువలు నిర్లక్ష్యం మాటున ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చేబోదుల లక్ష్మీనారాయణ, కనపాక చౌదరినాయుడు, నారు జనార్దనరావు, కిమిడి రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

పసుపు పల్లాలతో ప్రయోజనాలు



పంట పొలాల్లో పసుపు పల్లాలు నాటిస్తున్న ఎన్‌పీఎం సిబ్బంది

భామిని: మండలంలోని కాట్రగడ బీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు జిగురు గల పసుపు పల్లాలు పంచి పంట పొలాల్లో మంగళవారం ఎన్‌పీఎం సిబ్బందినాటించారు. సేంద్రీయ వ్యవసాయ విధానంలో పంటలను ఆశించే దోమలను గుర్తించి, వాటి నివరణకు అవసరమైన కషాయాలు తయారు చేసి నివారించవచ్చని వారు రైతులకు తెలిపారు. ఎకరా పంట పొలంలో 13 జిగురు పసుపు పల్లాలు నాటుకోవాలని సూచించారు. దీంతో పురుగు మందులు వాడనవసరం లేదన్నారు. నులకజోడు ఐసీఆర్‌పీలు వలరౌతు ప్రభాకరరావు, బి.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పాలకొండ: అమరవీరుల త్యాగాలు మరువలేనివని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు అన్నారు. అమరవీరులకు వందనం కార్యక్రమన్ని మంగళవారం కళాశాలలో నిర్వహించారు. ఏపీఎస్పీ 5వ బెటాలియన్ సీఐ శ్రీను సిబ్బందితో పాటు కార్యక్రమంలో పాల్గొని అమరవీరుల త్యాగాలను వివరించారు. వారి కోసం కొద్ది సమయం మౌనం పాటించి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వి.అప్పారావు, అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు సన్నద్ధమవుతున్న 11 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ చేశారు. యస్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవ సంస్థ సహకారంతో సమకూర్చిన ఈ మెటీరియల్‌ను మంగళవారం పాఠశాలలో అందజేశారు. విద్యార్థులకు తమవంతు సహకారం అందించిన దాతలకు ప్రధానోపాధ్యాయుడు బిడ్డిక భీముడు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు కూడా దాతలిచ్చిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని, పరీక్ష బాగా రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తులో తాత్సారమెందుకో?

గరుగుబిల్లి: మండలంలోని ఉద్దవోలు, బీవీపురం గ్రామ పంచాయతీల్లో అనర్హులైన పలువురు పింఛన్లు పొందుతున్నారని నమోదైన ఫిర్యాదు మేరకు నిర్వహించాల్సిన దర్యాప్తులో తాత్సారం ఎందుకు చేస్తున్నారని బీవీపురం సర్పంచ్ బొత్స లక్ష్మి, నాయకులు చింతల మల్లినాయుడు, మరడాన సత్యనారాయణ, బానాల సురేష్‌లు ప్రశ్నించారు. ఉద్దవోలు పంచాయతీలో 42 మంది అనర్హులైన పింఛన్‌దారులుండగా, వారిలో 18 మందికి మాత్రమే పింఛన్లు నిలిపివేశారని, మిగతా వారిపై కూడా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అలాగే బీవీపురానికి సంబంధించి, 39 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నారని ఫిర్యాదులు చేసినా ఎంపీడీవో పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉద్దవోలు, బీవీపురం గ్రామాల్లో అనర్హులైన పింఛన్‌దారులకు పింఛన్ల అందజేతపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కోరారు. అనర్హులకు పింఛన్లు ఇవ్వడం ద్వారా అర్హులైన వారు నష్టపోతున్నారన్నారు.

మంచి అలవాట్లు అలవర్చుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠం

కొమరాడ: విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని ఎస్ఐ కె.నీలకంఠం సూచించారు. మండలంలోని చినఖేర్జిల గిరిజన ఆశ్రమ పాఠశాల(బాలురు)ను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో సమావేశమై మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో ఎంతోమంది యువత చెడు వ్యసనాల బారినపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డెన్ సీతారాం, తదితరులు పాల్గొన్నారు.